క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: ఏజీ కాలనీ విద్యుత్‌ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు సంజీవహిల్స్, నలందానగర్, సిరిమల్లేనగర్, ఏజీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

వర్మికంపోస్ట్ ద్వారా అధిక దిగుబడులు



రైతులకు వర్మికంపోస్ట్ పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: సేంద్రీయ ఎరువులలో వర్మికంపోస్ట్ చాల ముఖ్యమైనదని దీనిని మనం మన పొలాల దగ్గర తయారు చేసుకోవ్చని వానపాములు,సేంద్రీయ నిలవలు ఎక్కువగా ఉన్న నెలలో బొరియలు చేసి నెలను గుల్ల పరుస్తుంటాయని అందువలన వీటిని రైతు మిత్రులుగా గుర్తిస్తారని అందుకు రైతులు ప్రతి ఒక్కరు తప్పని సరిగా రసాయన ఎరుగులు తగ్గించి వర్మికంపోస్ట్ తయాని విదానంలో మెలుకువలు పాటిస్తే అధికలాభాలు సాదించవచ్చని వ్యవసాయ కళాశాలఅసోసియెట్ డీన్ నరేంద్రరెడ్డి, అన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న బీజేపీ రంగారెడ్డి రూరల్ ప్రధాన కార్యదర్శి ఎం.సుదర్శన్‌రెడ్డి

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేవలం భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని బీజేపీ రంగారెడ్డి రూరల్ ప్రధాన కార్యదర్శి ఎం.సుదర్శన్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి బండారి బాలకృష్ణ, బూత్‌ల అధ్యక్షులు బి.శేఖర్‌గౌడ్, వి.వెంకట్‌రెడ్డి, డి.ఎధర్‌యాదవ్, రాకేష్‌గౌడ్, అధ్యక్షతన నిర్వహించిన ప్రజాగోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిజాం నిరంకుశ పాలనను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, సందీప్‌ముదిరాజ్, సత్యనారాయణముదిరాజ్ పాల్గొన్నారు.

'ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే'

గోల్కొండ: విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు, ముస్లిం అడ్వొకేట్ ఫోరం రాష్ట్ర చైర్మన్ వహీద్ అహ్మద్ అన్నారు. శుక్రవారం కుల్సుంపురాలో ని శుజా గ్రామర్ స్కూల్ కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ సెర్మనీ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు పట్టాలు అందజేసి వారికి చదువులు నేర్పిన ఉపాధ్యాయ బృందానికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 32 ఏళ్లుగా విద్యారంగంలో ఎందరో విద్యార్థులు దేశానికి అందించిన ఘనత శుజా గ్రామర్ స్కూల్‌దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ముజఫర్ హుస్సేన్, పాఠశాల సెక్రటరీ కరెస్పాండెంట్ సయ్యద్ ఎహెతాశాక్ ఉద్దీన్ బదర్, ప్రధానోపాధ్యాయురాలు దీనా ఉష్రా, శంషియా తబస్సుమ్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

గోల్కొండ: టీబీ వాధిని సకాలంలో గుర్తిస్తే నివారించవచ్చని గోల్కొండ తెలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్. అనురాధ దేవి అన్నారు. శుక్రవారం గోల్కొండ టీబీ కేంద్రం వారు పాఠశాలలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ కేంద్రం వారు కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ కుష్టు వ్యాధిగ్రస్తులకు తమ కేంద్రంలో ఉచితంగా పరీక్షలతో పాటు మందులు కూడా అందిస్తామని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28న 'మనూ'లో సెమినార్

రాయదుర్గం : మనూ ఇస్లామిక్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ జాతీయ సెమినార్‌ను నిర్వహించనున్నట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ ఫహీమ్ అక్తర్ శుక్రవారం తెలిపారు. ఇస్లామిక్ ఫిఖ్ అకాడమీ ఇండియా(ఐఎఫ్ఏఐ) సహకారంతో 'ఇండియన్ నాన్ ముస్లింమేతర ఇస్లామిక్ స్టడీస్' అనే అంశంపై ఈ సెమినార్ జరుగుతుందన్నారు.

వీధికుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల బెడదను పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు చేపడుతున్నామని మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల ప్రిన్సిపల్, ఇన్‌చార్జిలతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కమీషనర్ జి.వేణుగోపాల్ రెడ్డి, బ్లూ క్రాస్ సిఎఫ్‌వో కుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్. సురేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి రోజు ప్రార్థన సమయంలో కుక్క కాటుకు గురికాకుండా ఉండడానికి ఏం చేయాలో వారికి సలహాలు, సూచనలు అందించారు. కుక్కలు ప్రభుత్వ పాఠశాలల్లో రాకుండా పలు ఏర్పాట్లు చేస్తామని సూచించారు.

వీధి కుక్కల నుంచి ప్రజలను కాపాడాలి

రాజేంద్రనగర్: బస్తీలు, కాలనీలలో గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ కోరారు. రాజేంద్రనగర్ డివిజన్ ఎర్రబోడలో కుక్కల దాడిలో గాయపడ్డ నలుగురు చిన్నారులను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్తీలు, కాలనీలలో స్వైర విహారం చేస్తూ పిల్లలపై దాడి చేస్తున్న వీధి కుక్కల నుంచి ప్రజలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బీట్కూరి సిద్దేశ్వర్, రాజేంద్రనగర్ ఓబీసీ అధ్యక్షులు కాసోజు మల్లేష్‌చారి తదితరులున్నారు.



కుక్కల దాడిలో గాయపడ్డ పిల్లలను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

పిల్లోనిగూడలో సామూహిక సీమంతాలు

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడలో శుక్రవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచు బుచ్చమ్మ మాట్లాడుతూ.. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ, తల్లీ ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. స్థానికంగా లభించే తాజా పండ్లు, కూరగాయాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మజ్యోతి, అనిత, ఆశావర్కర్లు సుమతమ్మ, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.



సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచు బుచ్చమ్మ

10 తులాల బంగారు నగల చోరీ

రాజేంద్రనగర్: పుణ్యక్షేత్రానికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగలుపడి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు ఎత్తుకెళ్లిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపిన మేరకు.. హిమాయత్‌సాగర్ ప్రాంతానికి చెందిన రాములు తన కుటుంబ సభ్యులతో గురువారం ఇంటికి తాళం వేసి వరంగల్‌లోని పుణ్యక్షేత్రానికి కుటుంబ సమేతంగా తరలివెళ్లారు. అతడి కుమారుడు ఇంటి వద్దే ఉన్నాడు. బంధువుల ఇంట్లో శుభకార్యానికి రాములు కుమారుడు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఒక యువకుడు ఇంటి ప్రహరీని ఎక్కి లోనికి ప్రవేశించాడు. తాళాలు పగులగొట్టి 10 తులాల బంగారు ఆభరణాలు, ఐదు తులాల వెండి వస్తువులు 50 వేల నగదుతో ఉడాయించాడు. ఇందుకు సంబంధించిన పూర్తి దృశ్యాలు ఇంటి వెనకాలే ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. తెల్లవారుజామున ఇంటికి వచ్చిన రాములు కుమారుడు ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా అల్మారాలోని వస్తువులన్ని చిందరవందరగా పడేసి ఉన్నాయి. దీంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన వధువులకు పెళ్లి కానుకగా నగదు అందజేత

ఇశంషాబాద్ రూరల్ : మండలంలోని చౌదరిగూడలో నూతన వధువుకు స్థానిక సర్పంచు రాజ్‌కుమార్ పెళ్లి కానుకగా నగదును అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆడపిల్ల పెళ్లి కానుకగా గ్రామానికి చెందిన సమత, మానస వివాహానికి రూ.10,051 చొప్పున నగదును శుక్రవారం అందజేశారు. ఈయనతో పాటు బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు టి.శ్రీనివాస్ సైతం మానసకు రూ.10,051 నగదు ఇచ్చారు.



నూతన వధువుకు పెళ్లి కానుకగా నగదు అందజేస్తున్న సర్పంచు రాజ్‌కుమార్

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపడం ఖాయం



సమావేశంలో నాయకులు రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: నానక్‌రాంగూడలో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్నర్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు మీన్‌లాల్‌సింగ్,సంతోష్‌సింగ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్‌భారత్, ముద్ర యోజన, తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు హన్మంతునాయక్, నర్సింహారావు, వరలక్ష్మీ, కిషన్, శివాసింగ్, శ్రీకాంత్‌రెడ్డి, బబ్లూసింగ్ పాల్గొన్నారు.

మస్తాన్‌నగర్‌లో..

గచ్చిబౌలి: ప్రజల గోస పట్టని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపడం ఖాయమని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి ఎం రఘునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ డివిజన్ మస్తాన్‌నగర్‌లో బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరానికి మకుటంలాంటి హైటెక్‌సిటీకి ఆనుకొని ఉన్న కాలనీ మస్తాన్‌నగర్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. ప్రభాకర్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మణికొండలో ఎగ్జిబిషన్‌కు ఆదరణ

మణికొండ: దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్ మణికొండ పైప్‌లైన్ రోడ్డులో సుందర్ గార్డన్ ఫంక్షన్ హాల్ పక్కన కొనసాగుతుండటంతో ప్రజలు ఆదరిస్తున్నారు. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైన ర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యువలరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులను అమ్మకాలు జరుపుతున్నారు.



హ్యాండ్ బ్యాగులు, పర్సులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

రాజ్యాంగంలో న్యాయం,స్వేచ్ఛకు ప్రాధాన్యం

రాయదుర్గం: రాజ్యాంగంలో పొందుపర్చిన న్యాయం, స్వేచ్ఛ ప్రాముఖ్యతను సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ జే చలమేశ్వర్ వివరించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అల్లాడి స్మారక ఉపన్యాస కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవ రావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సుల '75 ఏళ్ల భారత న్యాయవ్యవస్థ, దాని స్వాతంత్ర్యం, సమర్థత' అనే అంశంపై చలమేశ్వర్ మాట్లాడారు. రాష్ట్రంలో కార్యనిర్వాహక, శాసనసభ, న్యాయవ్యవస్థ వంటి వివిధ శాఖల మధ్య అధికార పంపిణీని ఆధునిక ప్రజాస్వామ్యాలు ఎలా నిర్ధారిస్తున్నాయనే దాని గురించి వివరించారు. కొలీజియం వ్యవస్థపై ఆయన వ్యాఖ్యానిస్తూ దానికి అవసరమైన పారదర్శకత లోపించిందన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు.

'సండే ఈవినింగ్ టాక్' రేపు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 'ఇంట్రెస్టింగ్ గాసిప్స్ ఇంటెన్సివ్‌లీ కార్మిక్' అనే అంశంపై ప్రముఖ యూత్ మోటివేటర్ బి.కె.రుచి ప్రత్యేక ఉపన్యాసం ఇస్తారు.

మజ్లిస్‌కు దేశవ్యాప్త ఆదరణ: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఆదరణ లభిస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన మజ్లిస్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లతో నేటి నుంచి ముంబైలో ప్రారంభం కానున్న మజ్లిస్ 2 రోజుల జాతీయ సమావేశానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిహార్, మహారాష్ట్ర నుంచి పార్టీ తరపున ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని, కర్ణాటకలో మున్సిపాలిటీలో మజ్లిస్ అభ్యర్థులు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారన్నారు. మజ్లిస్ జాతీయ భావాలు, సెక్యులర్ విధానాల కారణంగానే ప్రజలు తమ పార్టీని ఆదరిస్తున్నారని ఆయన అన్నారు. అంతేకాకుండా మజ్లిస్ పార్టీకి బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల మద్దతు లభిస్తుందని ఆయన తెలిపారు. పార్టీ అధినేత ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి అని అందువల్లే ఆయన దేశంలో దళితులు, మైనార్టీలు, బీసీలపై జరుగుతున్న దౌర్జన్యాలను ఖండిస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్ ఫరాన్, అజీజ్‌ఖాన్ పఠాన్, అలీమొద్దీన్, రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

ప్రశాంతంగా విద్యార్థి సంఘం ఎన్నికలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం 2022-23 ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికలలో 5,300 మంది విద్యార్థులు ఓట్లు వేశారు. క్యాంపస్‌లో శనివారం ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఏబీవీపీ, ఓబీసీఎఫ్, ఎస్ఎల్‌వీడి విద్యార్థి సంఘాలు ఒక కూటమిగా, ఏఎస్ఏ, డీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ మరో కూటమిగా , అలయన్స్ ఫర్ సోషల్ డెమొక్రసీ పేరిట బీఎస్ఎఫ్, ఫ్రెటర్నిటీ, ఎంఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, టీఎస్ఎఫ్ ఇంకో కూటమిగా దిగాయి. వీటికి పోటీగా వైఐఎస్ఎస్ విద్యార్థి సంఘం కూడా పోటీలో ఉంది.

రైతులకు సన్మానం

గోల్కొండ: ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని గోల్కొండ బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు రావుల మాణిక్ ప్రభు అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ అధ్యక్షుడు రాజ్ కుమార్ చాహెర్ సూచనల మేరకు శుక్రవారం గుడిమల్కాపూర్‌లోని కూరగాయల మార్కెట్‌లో నమో కిసాన్ సమ్మాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా రావుల మాణిక్ ప్రభు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా కార్యదర్శి రాజేందర్ శర్మ, కార్యదర్శి పల్లికొండ రమేష్, రాజేష్ ముదిరాజ్, రాచర్ల దినేష్, గోదా లక్ష్మీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం' పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆయుష్మాన్ భారత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్

రాజేంద్రనగర్: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేద ప్రజల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకువస్తున్నారని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ వార్డు కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌లో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 10 సంవత్సరాలలోపు ఆడపిల్లలకు ప్రధానమంత్రి సమృద్ధి యోజన పథకం నేరుగా పోస్ట్ ఆఫీస్‌కి వెళ్లి వీటన్నింటిని ప్రజలు దృష్టిలో ఉంచుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీటుకూరి సిద్దేశ్వర్, అత్తాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రావుల జగన్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన నిందితుడిని శిక్షించాలి

శంషాబాద్: వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన నిందుడు సైఫ్‌ని కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరక శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కాకతీయ మెడికల్ కళాశాలలో జరిగిన ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటన బాధాకరమైందని ఏబీవీపీ శంషాబాద్ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్, ఎస్ఎఫ్ఎష్ కో-కన్వీనర్ ప్రదీప్‌అన్నారు. బాధ్యుడైన సైఫ్‌కు తగిన శిక్షపడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రీతికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మణికంఠ, కుషిసింగ్, పవన్, అనిల్, జయపాల్, కార్తీక్, వసంత,సుచిత్ర, అక్షిత, వెన్నెల, భార్గవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నేతలు

నీటి సమస్యను పరిష్కరిస్తాం



మంచినీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి

మణికొండ: మార్చి నెలాఖరు లోపు నీటి సరఫరా లేని కాలనీలన్నింటికీ పనులు చేపట్టి నీటి సమస్య లేకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జలమండలి అధికారులు కృషి చేస్తున్నారని మణికొండ మున్సిపాలటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. తన 19వ వార్డులో జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔటర్‌రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రతి ఇంటికి నీటి కనెక్షన్ ఇవ్వాలనే లక్ష్యంతో పనులను చేపట్టిందన్నారు. అందులో బాగంగా రిజర్వాయర్‌ల నిర్మాణం, పైప్‌లైన్‌ల పనులను శరవేగంగా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి కాంట్రాక్టర్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మణికొండ: వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు పుప్పాలగూడ మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న మణికొండ మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ డి. పురుషోత్తం మాట్లాడుతూ వేసవి కాలంలో సకాలంలో మంచినీరు లభించక ఎంతో మంది ఇబ్బందులు పడతారని, అలాంటి వారికి ఇలాంటి సేవా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మనం చేసే సేవా కార్యక్రమాలు మనకు ఎంతో మానసిక తృప్తి ఇస్తాయన్నారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ ఎస్. శ్రీధర్, చర్చి సభ్యులు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన కౌన్సిలర్ పురుషోత్తం

వ్యర్థాలను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం



హోటల్ నిర్వాహకుడికి సూచనలు అందజేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: వ్యర్థాలను రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో వేసిన వారిపై జరిమానాలు వేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, మటన్, చికెన్ సెంటర్లల్లో ఆయన శుక్రవారం అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వాహకులకు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయవద్దు అని వాటిని తినేందుకు వచ్చే కుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నాయని వివరించారు. చెత్త సేకరణదారులకు వాటిని అందించాలన్నారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. మన ఇంటితో పాటు చూట్టు పక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. రోడ్లపై వ్యర్థాలను పాడేసే వారికి జరిమానాలు విధించడంతో పాటు కఠిన చరర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో మున్సిపల్ అధికారులు నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

మణికొండ: విద్యుత్ సంస్థ యాజమాన్యం ఉద్యోగులకు పీఆర్సీ ఇస్తామని హామి ఇచ్చి ఇప్పటివరకు వాయిదాలు వేస్తూ వస్తుండటాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు దరించి నిరసన తెలిపారు. నార్సింగిలోని విద్యుత్ డీఈ కార్యాలయంలో 1104 యూనియన్ ప్రతినిధులు పరబ్రహ్మ మూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌తో పాటు ప్రభుత్వ, సంస్థ హామిని వెంటనే నిలుపుకోవాలని ఆయన కోరారు. అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి రాజు, జూనియర్ అకౌంటర్స్ అధికారులు వెంకటేశ్, స్వామిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ ఉద్యోగులకు ఏప్రిల్ 2022 నుంచి రావాల్సిన నూతన వేతనాలపై పిఆర్‌సి వేసి దాదాపు ఏడాది అయినప్పటికి యాజమాన్యం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో విద్యుత్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. మొదటి రోజు ఉద్యోగులు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని లేని పక్షంలో మరింత ఉధృతం చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ఉద్యోగులు ఆందోళనకు వెళితే విద్యుత్‌కు అంతరాయం కలిగితే ప్రజలకు ప్రభుత్వం జవాబుదారులవుతారన్నారు. గగన్‌పహాడ్ ఈఆర్‌వో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి నాగమణి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు రవీందర్, వెంకటకృష్ణ, వేణుగోపాల్, సిబ్బంది మల్లేష్, పద్మనాభం, శామ్యూల్, సురేష్ పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు